క్లుప్తంగా

చంద్రబాబు హామీని అమలు చేయాలి

పెద్దదోర్నాల: కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా బుధవారం డిమాండ్స్‌డే గా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన అంగన్‌వాడీలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, వీవోఏ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ స్కీం వర్కర్కకు 26 వేల జీతాన్ని ఇవ్వాలని, పెన్షన్, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుబ్బమ్మ, ముంతాజ్, వెంకటలక్ష్మి, నాగేంద్ర, మల్లేశ్వరి, మరియమ్మ, అలివేలు, సత్తిబాయి, బాలాకుమారి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం నిరసన

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని స్థానిక ఎమ్మార్సీ సిబ్బంది బుధవారం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండల యూనియన్ నాయకులు నాగేంద్రుడు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నామని, తమకు రావాల్సిన మే, జూన్ నెల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, వీటితో పాటు ప్రభుత్వానికి తెలియచేసిన తమ కోరికలన్నీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హనుమానాయక్, సత్యం, సుబ్బారెడ్డి, ప్రభాకర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బేస్తవారిపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, నూతనంగా అమల్లోకి తెచ్చిన మూడు క్రిమినల్ న్యాయ చట్టాలను నిలుపుదల చేయాలని సీఐటీయూ నియోజకవర్గ అధ్యక్షుడు అన్వర్‌బాషా, జిల్లా నాయకుడు తిరుపతయ్య అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ బి. పద్మా వతికి జాతీయ కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా వినతిపత్రం అందచేశారు. ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ పథకాన్ని నిలుపుదల చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడం అన్యాయమని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయతీల్లో పనిచేసే కార్మికులను రెగ్యులర్ చేయాలని, బకాయిలు వెంటనే వెంటనే విడుదల చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, వీఆర్‌ఏలకు కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ అబ్రహం, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు కౌలు కార్డుల జారీపై అవగాహన

పొదిలి: రైతులకు కౌలు కార్డుల జారీకి సంబంధించి వీఆర్‌ఓలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మహ్మద్ జియా మాట్లాడుతూ మండలంలోని ప్రతి కౌలు రైతును గుర్తించి వారికి గుర్తింపు కార్డు మంజూరు చేయాలన్నారు. ఏపీ కౌలుదారుల చట్టం 2019 ప్రకారం 11 నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. రైతుకు, కౌలుదారునికి జరిగిన అగ్రిమెంటుపై వీఆర్‌ఓ సంతకం ఉంటుందన్నారు. సంతకం చేసే ముందు వీఆర్‌ఓలు సదరు దరఖాస్తులను, రికార్డులను నిశితంగా పరిశీలించాలని సూచించారు. కౌలు రైతులకు కేవలం సాగు చేసిన పంట మీద మాత్రమే అధికారం ఉంటుందన్నారు. సంబంధిత భూ యజమాని గ్రామంలో లేనట్లయితే వీడియో ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా తన సమ్మతిని తెలపాల్సి ఉంటుందని చెప్పారు. వ్యవసాయాధికారి జైనులాబ్దీన్ మాట్లాడుతూ కౌలు కార్డులు వీఆర్‌ఓలు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులు వేసిన పంటలను నమోదు చేస్తామని చెప్పారు. పంట నష్ట పరిహారం, సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, బ్యాంకు రుణాలు కౌలు రైతులకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పశువుల యాజమానులకు నోటీసులివ్వండి

● నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు: పశువులను రోడ్లపై విచ్చలవిడిగా వదిలేస్తున్న యాజమానులకు నోటీసులు జారీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా లాయరుపేట, దిబ్బల రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల రైతు బజార్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపజేసి బ్లీచింగ్, సున్నం కలిపి చల్లించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. సంతపేట, ప్రగతికాలనీలోని బందెలదొడ్డిని పరిశీలించిన అనంతరం పశువుల యజమానులకు నోటీసులు జారీచేయడంతో పాటు కరపత్రాలు, మైకుల ద్వారా కూడా విస్తృత ప్రచారం చేయాలన్నారు. పశువులు, ఆవులు, ఎడ్లు, దూడలను రోడ్లపైకి ఇష్టానుసారం వదలడం వలన ప్రజలు ప్రమాదాల బారినపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. అందువలన శానిటరీ విభాగం, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయాల్లోని శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, శానిటరీ మేస్త్రీలకు ప్రతినెలలో చివరి గురువారం అన్ని పశువులను ప్రగతి కాలనీలోని బందెల దొడ్డికి తరలించి వాటికి మేత, నీటి సదుపాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని 4వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఎటువంటి అశ్రద్ధ వహించినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



ఎంఆర్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మద్దిపాడు: పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలంటూ సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మే, జూన్ నెలలకు పెండింగ్‌లో ఉంచిన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెకాలంలో జీతం, సమ్మె అగ్రిమెంట్ అమలు, హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు, అన్ని విభాగాలకు ఎంటీఎస్ వర్తింపు, నూతన డీఎస్‌సీలో తమకు వెయిటేజ్ ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీవైజ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, కరువు భత్యం, ఇంటి అద్దె, గ్రాట్యుటీ సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక భద్రత పథకాలు ఈపీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. జీతాలు సకాలంలో రాక ఉద్యోగులు వేదన చెందుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్టేట్ జేఏసీ సెక్రటరీ జనరల్ కల్యాణి, జిల్లా నాయకులు వినయ్, శ్రీదేవి పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి



ప్రైవేటు పాఠశాలల యజమానులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివాజీ

చీమకుర్తి: విద్యార్థుల నుంచి తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని ఎంఈఓ కే శివాజీ ప్రైవేటు పాఠశాలల యజమానులకు సూచించారు. బుధవారం చీమకుర్తి ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేనటువంటి పుస్తకాలను పాఠశాల ప్రాంగణంలో విక్రయించరాదన్నారు. పాఠశాలలో నమోదై ప్రస్తుతం పాఠశాలలో చదవనటువంటి విద్యార్థుల వివరాలను యూడైస్ కోడ్ నుంచి తొలగించాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పై వివరాలను ధ్రువీకరిస్తూ ప్రతి పాఠశాల యాజమాన్యం సర్టిఫికెట్‌ను ఎంఆర్‌సీ కార్యాలయానికి అందించాలని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో చీమకుర్తి మండలంలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు సౌకర్య పేరుతో విద్యార్థులకు వసతులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు ప్రాజెక్టు సౌకర్య పేరుతో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ హెచ్‌ఎం ఎం సుధాకర్ అన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, సైనికుల, పోలీసులు, మండల స్థాయి అధికారుల సహాయంతో విద్యార్థులకు దోమతెరలు, సీలింగ్ ఫ్యాన్స్, తాగునీటి ట్యాంకు రిపేర్లు తదితర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇందుకుగానూ చేయూత మిత్రమండలి బేస్తవారిపేట రూ.10 వేలు, ఎస్‌టీయూ తర్లుపాడు శాఖ రూ.5 వేలు, ఎన్‌హెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న రాజ్‌కుమార్ రూ.5 వేలు, ఎన్‌హెచ్‌ఎస్ హెచ్‌ఎం కెజియారాణి రూ.5 వేలు, డిఫెన్స్ అకౌంటెంట్ రూ.5 వేలు, చేగిరెడ్డి వెంకటరామిరెడ్డి రూ.5 వేలు, ఆర్‌యూపీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర రూ.5 వేలు, ఎంఈఓ 2 సుబ్బారావు రూ.3 వేలు, ఏరువ మనోహర్‌రెడ్డి సీఆర్‌పీఎఫ్ రూ.20 వేలు సేకరించి ఆర్థిక సాయాన్ని ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరమ్మకు అందించారు. దాతలను ఎంఈఓ 2, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు

కొత్తపట్నం: కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పి.పద్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో స్వామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా దేశ సంపదను కార్పొరేటర్లకు కట్టబెట్టి ప్రైవేటీకరణ విధానాలు కొనసాగిస్తున్నాయన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన పాత విధానాలను కొనసాగించాలని నిర్ణయించుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, అదే అమలు జరిగితే నేడు చట్టాలు నాశనమవుతాయని తెలిపారు. సమ్మెలు సాధ్యపడవని, పనివేళలు పెంచడం, ఉన్న హక్కులను తొలగించడం, జీతాలు పెంచకపోవడం, నిర్బంధాన్ని తీవ్రతరం చేయడం యజమానులకు తేలిక అవుతుందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికుల హక్కులు సాధించడానికి కార్మిక వర్గానికి సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. కార్మిక ఉద్యోగులంతా ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ హేమంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిర్మల, కృప, సుజాత, అరుణ, కే శ్రీను, కె.భాగ్యలక్ష్మి, పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



గంగదేవిపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దొనకొండ (కురిచేడు): సీజనల్‌గా వచ్చే డెంగీ, మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం వైద్యాధికారి కె.సునీత కోరారు. మలేరియా, డెంగీ జ్వరాల వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 5 ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నిర్మూలన మందు సైపోమిత్రిన్ పిచికారీ చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం, బాలుర వసతి గృహం, వెనుబడిన తరగతుల సంక్షేమ సంఘం బాలికల వసతి గృహాల్లో మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మందు పిచికారీతో దోమలు వ్యాప్తిని నివారించవచ్చన్నారు. హాస్టల్ విద్యార్థులు దోమ తెరలు వాడాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. హ్యాండ్ వాష్ చేసుకునే పద్ధతుల గురించి తెలిపారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, డయేరియా వ్యాధులకు తీసుకోవాల్సిన చికిత్స, జాగ్రత్తల గురించి అవగాహన కలిగించారు. హెల్త్ సూపర్‌వైజరు కేవీఆర్ ప్రభావతిదేవి ఆధ్వర్యంలో మండలంలోని గంగదేవిపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాడి పడేసిన టైర్లు, కొబ్బరి బోండాలు పరిసరాల్లో ఉంచకూడదని, నీటి నిల్వల్లో కిరోసిన్ చల్లాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీటి తొట్లు పరిశుభ్రం చేసుకోవాలని, దోమతెరలు వాడాలని ఆమె సూచించారు.

సీహెచ్‌ఓ ఇన్నాసమ్మ, సబ్ యూనిట్ అధికారి కృష్ణ, ఎంపీహెచ్‌ఎస్ ఫ్లెమింగ్, ఎంఎల్‌పీహెచ్ రూతు, ఏఎన్‌ఎం ఇందిర, కేజీబీవీ ప్రిన్సిపాల్ జి. మమత, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ జీసీహెచ్ మంత్రునాయక్, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం బాలుర వసతి గృహం వార్డెన్ బి. సురేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘ బాలికల వసతి గృహం వార్డెన్ కె. ప్రభావతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి అభయాంజనేయస్వామి ఆరాధనోత్సవాలు



విద్యుత్ కాంతులతో కొండమీద శ్రీగిరి దేవస్థానం

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద వెంకటేశ్వర స్వామి ఆలయ క్షేత్ర పాలకుడైన అభయాంజనేయ స్వామి ఆగమన ఆరాధనోత్సవాలను ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తెలిపారు. 13న ఉదయం అభయాంజనేయస్వామికి అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం అర్చన, ఊంజల సేవ సందర్భంగా శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్‌చే భక్తిగీతాల ఆలాపన జరుగుతాయని వివరించారు. 14న ఉదయం తొమ్మిది గంటలకు హనుమత్ హోమం, పూర్ణాహుతి, 15వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ప్రముఖ హనుమత్ ఉపాసులు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులుచే సుందరకాండ పారాయణ జరుగుతాయని వెల్లడించారు. అభయాంజనేయ స్వామి ఆగమన ఆరాధనోత్సనాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలలో పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థాన కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

రక్తదానం చేయడం మనందరి బాధ్యత



రక్తదానం చేస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

ఒంగోలు టౌన్: సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం, ప్రాణాపాయంలో ఉన్నప్పుడు వెంటనే స్పందించడం మనందరి బాధ్యతని డాక్టర్ చాపల వంశీకృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని శ్రీరాం సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ చాపల శాంత కుమారి ప్రారంభించిన ఈ శిబిరంలో వైద్యశాలకు చెందిన వైద్యులు చాపల వంశీకృష్ణ, సానల దీరజ్‌బాబు, నందలూరు సరయు, పాక్కిన ఏడుకొండలు, సౌమిత్ర పల్లవ్, చంద్రమౌళి రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్‌కు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కేజువాలిటీ వార్డు, ల్యాబొరేటరి, ఫిజియోథెరపీ, కాన్ఫరెన్స్ హాలును రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు శరత్, చాపల శ్రీనివాసులు, మారెళ్ల సుబ్బారావు, సయ్యద్ ఇస్మాయిల్, సురేంద్ర, కృష్ణమోహన్, కరిముల్లా, వెంకటేశ్వర్లు, శివశంకర్ పాల్గొన్నారు. రక్తదాతలకు శ్రీరామ్ ఆరోగ్య రక్ష హెల్త్ కార్డులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ఒంగోలు మెట్రో: క్రోధినామ సంవత్సరం ఆషాడ మాసం బుధవారం స్థానిక మంగమూరుడొంక అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో అభిషేకం, అర్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పరాంకుశ చక్రవర్తి రంగస్వామి అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులు నిర్వహించి కర్పూర హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

కనీస వేతనం, సమస్యల పరిష్కారమే ధ్యేయం



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కురిచేడు: స్కీం వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, క్లాప్‌మిత్ర, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కమిటీ గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్లేందుకు డిమాండ్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ నాయకురాలు షేక్ ఫాతిమా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఉద్యమాల సందర్భంగా చిరుద్యోగులకు న్యాయం చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే స్కీం వర్కర్లకు, పంచాయతీ, కాంట్రాక్టు కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్‌లు, రద్దు చేసిన వేతన భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కొండమ్మ, అంగన్‌వాడీ నాయకులు సువర్ణలత, రంగమ్మ, పార్వతి, వాణి, ఖాదర్‌బీ, ప్రభావతి, ఆశా వర్కర్ల నాయకులు గౌసియా, అంజలి, పంచాయతీ వర్కర్ల నాయకులు కె.అశోక్‌కుమార్, లక్ష్మయ్య, నాసరయ్య, ఏసమ్మ, కుమారి, క్లాప్‌మిత్ర నాయకులు ఎల్.జార్జి, గండి శ్రీను, నాగమణి, ఝాన్సీ, మిడ్‌డే మీల్స్ నాయకులు వెంకటరత్నమ్మ, ఖాశింబీ, నాసరమ్మ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అధ్యయన తరగతులు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దర్శి: దర్శిలో జరిగే జిల్లా స్థాయి ఉద్యమ అధ్యయన తరగతులను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కోరారు. ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సైదా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరుగు జిల్లా స్థాయి, మండల స్థాయి, సబ్ కమిటీ సభ్యులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు, రాష్ట్ర కౌన్సిలర్‌లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల కనుమరుగుకు కారణం అవుతున్న జీఓ నెంబర్ 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో రెండు మాధ్యమాలను కొనసాగించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13వ పీఆర్సీ వెంటనే వర్తంప చేయాలని కోరారు. అధ్యయన తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఏఎల్ ప్రసాద్, ఐదు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు వేతనాలివ్వాలి

దర్శి: మండలంలోని గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, క్లాప్ మిత్రలకు వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ బుధవారం జరిగింది. అనంతరం ఎంపీడీఓ, ఈఓఆర్డీ, రెవెన్యూ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మురికి కూపాల్లో పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పనులు చేస్తున్నారని చెప్పారు. ప్రజారోగ్యాన్ని కాపాడుతూ వారు అనారోగ్యం పాలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. చెత్తతోలే రిక్షాలు రిపేరు చేయించాలని కోరారు. రక్షణ పరికరాలు అందించాలన్నారు. చిన్న చిన్న కారణాలతో తూర్పు వీరాయపాలెం, బండివెలిగండ్లలో తొలిగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ శోభన్‌బాబు స్పందించి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన తర్వాత జీతాలు పూర్తిగా చెల్లించాలని కార్యదర్శులకు ఆదేశాలిస్తామన్నారు. కార్మికులు రాచపూడి ఎజ్రా, గుంటు బాల గురవయ్య, ఎస్తేరమ్మ, గుంటూరి వెంకటయ్య, యరగుంట్ల దావీద్ పాల్గొన్నారు.

మే, జూన్ నెలల జీతాలివ్వండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు



సర్వశిక్ష కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు వెంటనే మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ సర్వశిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆ మేరకు బుధవారం ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు పి.కల్పన మాట్లాడుతూ సమ్మె కాల జీతం, సమ్మె అగ్రిమెంట్లను అమలు చేయాలని కోరారు. హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాలకు ఎంటీఎస్ వర్తింపజేయాలని, నూతన డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని కోరారు. గెస్ట్, డైలీవేజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, కరువు భత్యం, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో అభ్యర్థన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, అరుంధతి, మీరా బీ భారతి, సుబ్బమ్మ, ఆదంబీ పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష జేఏసీ పిలుపు మేరకు మే, జూన్ మాసాల వేతనాలను వెంటనే ఇవ్వాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక సర్వశిక్ష కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో ప్లకార్డులు ప్రదర్శించారు.

బీజేపీ పాలనలో తిరోగమనంలో దేశం

ఒంగోలు టౌన్: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో శరవేగంగా తిరోగమనంలోకి దేశం వెళ్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు అన్నారు. జాతీయ డిమాండ్స్ డేని పురస్కరించుకుని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. గత పదేళ్లలో ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టిందని, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని జిల్లా నాయకుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.మహేష్, కొర్లపాటి శ్రీనివాసరావు, యు.రత్నకుమారి, సురేంద్ర, ఏపీ పుల్లారావు, తంబి శ్రీనివాసరావు, శేషయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో పయనించాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాని సాయిబాబా ఆలయం ధర్మకర్త డాక్టర్ జేవీ నారాయణ అన్నారు. ఈ నెల 21వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని షరాబ్ బజారులో బుధవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల వద్ద నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొనడం మానసిక ప్రశాంతత సంతరించుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో అనుసరించడంతో ఆనందదాయకమైన జీవనం గడపవచ్చన్నారు. భక్త సాయిబృందం వారు రమా, హైమా పాల్గొన్నారు.